ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
గురువారం 10 జూలై 2025

ధర్నాలతో దద్దరిల్లిన రాజధాని


రైలురోకోకు వెళ్తున్న కార్మిక సంఘాల కార్యకర్తలను కొరుక్కుపేట రైల్వేస్టేషన్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

● రాష్ట్రంలో కార్మిక సంఘాల సమ్మె పాక్షికం

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకూడదని, కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా ఎన్డీయే ప్రభుత్వం చేసిన నాలుగు చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 13 కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన సమ్మె రాష్ట్రంలో పాక్షికంగా జరిగింది. బస్సులు, ఆటోలు యథావిధిగా నడిచాయి. ఈ సార్వత్రిక సమ్మెకు రాష్ట్రంలోని డీఎంకే అనుబంధ కార్మిక సంఘం తొళిలాలర్ మున్నేట్ర సంఘం, సీపీఎం కార్మిక సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ, కాంగ్రెస్, ఎండీఎంకే, డీపీఐ కార్మిక సంఘాలు గట్టి మద్దతు ఇచ్చినప్పటికీ సమ్మె ప్రభావం అంతగా కనిపించలేదు. చెన్నైలో, తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై, తిరునల్వేలి, వేలూరు, తిరుపత్తూరు, తిరుప్పూరు తదితర నగరాల్లో సమ్మె ప్రభావం పాక్షికంగానే కనిపించింది. కార్మిక సంఘాలకు చెందిన ఆటోలు, టాక్సీలు మాత్రమే నడవలేదు. కీలాంబాక్కం, మాధవరం, కోయంబేడు బస్ స్టేషన్ల నుండి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు యథావిధిగా నడిచాయి. బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, తపాలా కార్యాలయాల్లో ఉద్యోగుల తక్కువ సంఖ్యలోనే హాజరయ్యారు. నైవేలిలోని ఎన్ఎల్‌సీలో ఉద్యోగులు, కార్మికులు విధులకు హాజరుకావటంతో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలుగలేదు. తిరుచ్చి బెల్ సంస్థలోనూ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు రాష్ట్రంలోని వాణిజ్య సంఘాల సమాఖ్య మద్దతు ప్రకటించలేదు. కోయంబేడు కూరగాయల మార్కెట్, జౌళి దుకాణాలు, నగల దుకాణాలు యథావిధిగా నడిచాయి ప్రభుత్వ సంస్థల్లో బుధవారం 90 శాతం మంది విధులకు హాజరైనట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు.

రాజధాని నగరం చెన్నైలో నాలుగు చోట్ల వివిధ కార్మిక సంఘాలు ధర్నా, రాస్తారోకో చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. సుమారు రెండు గంటలకు పైగా వాహనాల రాకపోకలు కూడా స్తంభించాయి. అన్నాసాలై తపాలా కార్యాలయం ఎదుట డీఎంకే అనుబంధ కార్మిక సంఘం తొళిలాలర్ మున్నేట్ర సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ తదితర కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. తొళిలాలర్ మున్నేట్ర సంఘం కోశాధికారి నటరాజన్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సౌందరరాజన్, హెచ్ఎంఎస్ నేత రాజా శ్రీధర్ ఆందోళనకు నాయకత్వం వహించారు. ఇదేవిధంగా గిండి తపాలా కార్యాలయ ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహించారు. అక్కడ ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాలకు చెందిన సుమారు 200 మందిని అరెస్టు చేశారు. అదే సమయంలో కొరుక్కుపేట రైల్వేస్టేషన్ వద్ద రైలు రోకో జరిపేందుకు ప్రయత్నించిన సుమారు 150 మందిని, వండలూరు రైల్వేస్టేషన్ వద్ద రైలురోకుకు ప్రయత్నించిన 150 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తిరువొత్తియూరు టోల్‌గేట్ వద్ద మాజీ శాసనసభ్యుడు మహేంద్రన్ నాయకత్వంలో రాస్తారోకో జరిగింది.

అంబత్తూరు రైతు బజార్ ప్రాంతం వద్ద వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఆవడి హైరోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు సుమారు 500 మందిని అరెస్టు చేసి సమీప ప్రాంతాల్లో కల్యాణమండపాలకు తరలించారు.


అన్నాసాలై తపాలా కార్యాలయం ఎదుట రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాలు

పుదువైలో బంద్ ప్రశాంతం


నిరసన ర్యాలీలో ఇండియా కూటమి కార్మికులు

పుదుచ్చేరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తూ కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో బుధవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. 17 డిమాండ్లతో కాంగ్రెస్, డీఎంకే, ఎండీఎంకే, సీపీఎం, సీపీఐ, డీపీఐ సహా ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు చెందిన కార్మిక సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. దాంతో బ్యాంకింగ్, రవాణా ఇతర సేవలకు అంతరాయం కలిగింది. ఏడాది పొడవునా పర్యాటకులు, వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే పుదుచ్చేరిలో బంద్ సందర్భంగా పలు ప్రాంతాల్లో దుకాణాలు మూసివేశారు. వాహన సేవలు పూర్తిస్థాయిలో నిలిపివేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. కాగా, పుదుచ్చేరిలోని కారైక్కాల్‌లో మామిడి పండ్ల ఉత్సవం, బాగూర్‌లో రథోత్సవం నిర్వహించనుండడంతో ఆ ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించలేదు. ఇదిలా వుండగా, బంద్‌లో పాల్గొంటే కఠిన చర్యలుంటాయని పుదుచ్చేరి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులతో ప్రభుత్వ ఉద్యోగులు యథావిధిగా విధులకు హాజరయ్యారు. అయితే ఇండియా కూటమి తరుపున అన్నా విగ్రహం నుంచి కొత్త బస్టాండు వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో కాంగ్రెస్, డీఎంకే, సీపీఐ, సీపీఎం కార్మిక సంఘాలు పాల్గొని కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా పుదుచ్చేరిలోని ప్రజా సంఘాల కార్మికులు, వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. బంద్‌ను పురస్కరించుకుని పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖ బందోబస్తును పటిష్టం చేసింది.

● పరందూర్ విమానాశ్రయం...

భూముల యజమానులకు పరిహారం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పరందూర్ విమానాశ్రయం కోసం భూములిచ్చిన 19 మంది యజమానులకు బుధవారం పరిహారం చెల్లించారు. కాంచీపురం జిల్లా పరందూర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2023 అక్టోబరు 31న అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో, విమానాశ్రయం కోసం స్వాధీనం చేసుకున్న భూములకు అందించే పరిహారం పెంచాలని ఆ భూముల యజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దానిని పరిశీలించిన ప్రభుత్వం, భూముల విలువ పెంచుతూ నిర్ణయించిన పరిహారం వివరాలను గత నెల 25వ తేది ప్రకటించింది. ఆ ప్రకారం, విమానాశ్రయం ఏర్పాటుకానున్న పరందూర్, పోరవూరు, నెల్వాయ్, వళత్తూర్, అక్కమ్మాపురం తదితర గ్రామాలకు చెందిన 19 మంది పట్టాదారులకు పరిహారం నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. కాంచీపురం కలెక్టర్ కలైసెల్వి మోహన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో, భూముల యజమానులు తమ భూములు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. ఆ ప్రకారం, 19 మందికి చెందిన 17.52 ఎకరాలకు రూ.9.22 కోట్లు పరిహారంగా చెల్లించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విమానాశ్రయ నిర్మాణపనులు చేపట్టనున్న తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ పేరిట భూములు రిజిస్ట్రేషన్ చేశారు.


రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్న యజమానులు


గ్లోబల్ జమాలియన్స్ బ్లాక్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

గాడ్సే గుంపును ఆదర్శంగా తీసుకోవద్దు

● విద్యార్థులకు సీఎం స్టాలిన్ హితవు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని, దేశ సేవ చేసిన, దేశంకోసం ప్రాణత్యాగం చేసిన దివంగత నేతలను ఆదర్శంగా తీసుకోవాలే తప్ప గాడ్సే గుంపును గుడ్డిగా అనుసరించవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. తిరుచ్చిలో బుధవారం జరిగిన జమాల్ మహమ్మద్ కళాశాల డైమండ్ జూబ్లీ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొని గ్లోబల్ జమాలియన్స్ బ్లాక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పనుల్లో ఎంత బిజీగా ఉన్నా, అలసటగా ఉన్నా యువకులైన విద్యార్థులను చూస్తే తనలో ఉత్సాహం ఉరకలేస్తుందని, విద్యార్థులు ఎక్కువగా ఉండే కాలేజీ ఫంక్షన్లలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తానన్నారు. తిరుచ్చి జమాల్ మహమ్మద్ కాలేజీకి తాను పలుమార్లు వచ్చానని, ఆ కళాశాల 75 యేళ్లుగా విద్యా సేవలను కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. కళాశాలల్లో ఏర్పడే స్నేహం చివరి వరకు కొనసాగించాలని, విద్యే స్థిరమైన ఆస్తి అని, విద్యార్థులకు రాజకీయాలపై అవగాహన అవసరమని స్టాలిన్ సూచించారు. ప్రస్తుతం దేశంలో గాడ్సేను ఆరాధించే వారు అధికమవుతున్నారని, విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ఆ గాడ్సే గుంపును ఆదర్శంగా తీసుకోకూడదని తెలిపారు. జాతిపిత గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ద్రావిడ ఉద్యమనేత పెరియార్ చూపిన మార్గంలో పయనించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. తమిళులంతా సమైక్యంగా ఉంటే ఎవరూ తమిళ సమాజాన్ని ఓడించలేరని చెప్పారు..

20లక్షల లాప్‌టాప్‌ల పంపిణీ...

విద్యకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఆలోచనతోనే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్లస్-2 చదవిన విద్యార్థులకు ప్రతినెలా రూ.1000లు ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను పెంపొందించుకోవాలనే లక్ష్యంతోనే లాప్‌టాప్‌లు ఉచితంగా అందజేస్తున్నామని, ఈ యేడాది కూడా 20లక్షల దాకా ఉచిత లాప్‌టాప్‌లు పంపిణీ చేయనున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, కొవి చెళియన్, అన్బిల్ మహేష్, మెయ్యనాధన్, టీఆర్బీ రాజా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొహిదీన్, ఎంపీలు తిరుచ్చి శివా, నవాజ్‌ఘనీ, కవయిత్రి సల్మా, ఎమ్మెల్యేలు ఇనికో ఇరుదయరాజ్, అబ్దుల్‌సమద్, మాజీ ఎమ్మెల్యే తమీమున్ అన్సారీ, జిల్లా కలెక్టర్ శరవణన్, జమాల్ మహమ్మద్ కళాశాల అధ్యక్షుడు జమాల్ మహమ్మద్ బిలాల్, కార్యదర్శి ఖాజా నజీముద్దీన్, కోశాధికారి జమాల్ మహమ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ జార్జ్ అమల్ రత్తినం తదితరులు పాల్గొన్నారు.

వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు 'నార్త్ అమెరికా తమిళ సంఘం' అవార్డు 8

'నిఫా' వైరస్ వ్యాప్తి

● సరిహద్దు జిల్లాల్లో నిఫా తీవ్రతరం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం మలప్పురం, పాలక్కాడు ప్రాంతాల్లో 'నిఫా' వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా కేరళ నుంచి వచ్చే వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతిస్తోంది. సరిహద్దు జిల్లాలైన నీలగిరి, కోవై, తిరుప్పూర్, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి తదితరాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేసి కేరళ నుంచి వస్తున్న వాహనాలకు క్రిమినాశిని మందు పిచికారీ చేయడంతో పాటు ఆయా వాహనాల్లోని ప్రయాణికులకు స్కాన్ చేస్తున్నారు. అలాగే, ఆరు జిల్లాల్లో కొద్దిరోజులుగా జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారిని గుర్తించి, నిఫా నిర్ధారణ పరీక్షలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


కేరళ నుంచి వస్తున్న వాహనాలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఈసారి వచ్చేది మేమే

● మాకు ప్రజాదరణ అపారం ● కోవై ప్రచార సభలో ఈపీఎస్

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ పాలనా తీరుకు వ్యతిరేకంగా తాను ప్రారంభించిన ఎన్నికల ప్రచారానికి ప్రజాదరణ అపారమని, అధికారంలోకి రాబోయేది తామేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 234 నియోజకవర్గాల ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకునేందుకు ఈపీఎస్ తన పర్యటన రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' (ప్రజలను కాపాడుదాం-రాష్ట్రాన్ని రక్షిద్దాం)అనే పేరిట తన ఎన్నికల ప్రచారాన్ని కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో సోమవారం శ్రీకారం చుట్టిన ఆయన మంగళవారం వరకు పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈపీఎస్ పాల్గొన్న సభలకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివస్తుండటంపై అన్నాడీఎంకే శ్రేణుల్లో హర్షం నెలకొంది. బుధవారం ఉదయం నిర్వహించిన రోడ్‌షోలో ఈపీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ పలు ప్రశ్నలు సంధించారు. భక్తులు ఆలయాలకు సమర్పించే కానుకలు, నిధులను ఆలయాల అభివృద్ధికి ఉపయోగించకుండా హిందూ దేవాదాయశాఖ కళాశాలలకు మళ్లిస్తోందని, విద్యాశాఖ కోసం కేటాయించే నిధులు ఏమయ్యాయని ఈపీఎస్ ప్రశ్నించారు. అన్నాడీఎంకేకు రాష్ట్రంలో ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోందని, 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లలో విజయం సాధించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని ఈపీఎస్ పేర్కొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

సెమ్మంకుప్పం వద్ద తమిళ గేట్‌కీపర్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా సెమ్మంకుప్పం వద్ద రైల్వే గేట్‌కీపర్‌గా తమిళం తెలిసిన ఉద్యోగిని దక్షిణ రైల్వే అధికారులు నియమించారు. మంగళవారం ఉదయం అక్కడ పనిచేసిన పంకజ్‌శర్మ తమిళం తెలియకపోవటం వల్లే గేట్ మూయలేకపోయాడని, ఆ కారణంగా స్కూలు వ్యాన్‌ను రైలు ఢీకొని ముగ్గురు విద్యార్థులు మృతిచెందారని ఆరోపణలు వచ్చాయి. పంకజ్‌శర్మను రైల్వే ఉన్నతాధికారులు సస్పెండ్ చేయగా, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం రైల్వే గేట్ కీపర్‌గా రెండేళ్ల అనుభవం కలిగిన రైల్వే ఉద్యోగి ఆనంద్‌రాజ్‌ను నియమించారు.

గేట్‌కీపర్ సహా 13 మందికి సమన్లు

సెమ్మంకుప్పం వద్ద జరిగిన ప్రమాదంపై దక్షిణ రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు. ఆ మేరకు ఆ ప్రాంతం వద్ద గేట్‌కీపర్‌గా పనిచేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన పంకజ్ శర్మ, వ్యాన్ డ్రైవర్ శంకర్, లోకో పైలెట్ శక్తికుమార్, అసిస్టెంట్ లోకో పైలెట్ రంజిత్‌కుమార్, రైల్వేస్టేషన్ అధికారులు విక్రాంత్‌సింగ్, అజిత్‌కుమార్, విమల్, అంగిత్‌కుమార్, ఆనంద్, వడివేలన్, వాసుదేవ్ ప్రసాద్, శివకుమారన్ సహా 13 మంది సమన్లు పంపించారు. వీరంతా తిరుచ్చి జోన్ రైల్వే భద్రతా విభాగం కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని ఆ సమన్లలో పేర్కొన్నారు.

విశ్వేష్ డిశ్చార్జ్ : సెమ్మంకుప్పం రైల్వేగేట్ వద్ద సంభవించిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన విద్యార్థి విశ్వేష్ బుధవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ ప్రమాదంలో మృతిచెందిన నిమలేష్ సోదరుడైన విశ్వేష్ కూడా తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సలందుకుని కోలుకున్నాడు. అదే సమయంలో ఆ ఆసుపత్రిలోనే పోస్టుమార్టం తర్వాత మార్చురీలో ఉంచిన నిమలేష్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు నిమలేష్ మృతదేహాన్ని తమనివాసగృహానికి తీసుకెళుతుండగా స్థానికులు నివాళులర్పించారు.


గేట్‌కీపర్ ఆనంద్‌రాజ్ - ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయి వస్తున్న విద్యార్థి విశ్వేష్

'మామిడి పండు' మాకే ఇవ్వండి

● ఈసీకి రాందాస్ వినతి



అడయార్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధ్యక్ష పదవి నుంచి డాక్టర్ అన్బుమణిని తొలగించామని, అందువల్ల పార్టీ ఎన్నికల గుర్తు మామిడి పండును తమకే కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి పాట్టాలిమక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ లేఖ రాశారు. పీఎంకేలో తండ్రీ కుమారుల ఆధిపత్యపోరు తార స్థాయికి చేరుకున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం వారిద్దరూ తమ అనుచరులతో పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తండ్రీకొడుకులు ఇద్దరూ తమ మద్దతుదారులతో కీలక సమావేశాలు నిర్వహించారు. ముఖ్యంగా రాందాస్ సారథ్యంలో జరిగిన సమావేశంలో కట్టిన బ్యానరులో అన్బుమణి ఫొటో, పేరు లేకుండా చేశారు. అలాగే, అన్బుమణి పేరు కూడా ప్రస్తావించకూడదని పార్టీ నేతలకు రాందాస్ హుకుం జారీ చేశారు. అంతేకాకుండా, పీఎంకే అధ్యక్ష పదవి నుంచి అన్బుమణిని తొలగించామని, అందువల్ల తన సారథ్యంలో పీఎంకేకు ఎన్నికల గుర్తును తమకే కేటాయించాలని ఆయన ఈసీకి లేఖ రాశారు. ఈ తీర్మానాన్ని సమర్థిస్తూ 1413 మంది కార్యవర్గ సభ్యులు, 21 మంది వర్కింగ్ కమిటీ సభ్యులు సంతకాలు చేసిన తీర్మాన ప్రతులను కూడా ఆ లేఖకు జత చేశారు. ఆ లేఖతో పాటు తీర్మానప్రతిని రాందాస్ వ్యక్తిగత కార్యదర్శి, పార్టీ అధికార ప్రతినిధి స్వామినాథన్ ఢిల్లీ వెళ్ళి లేఖ అందజేశారు. ఈ లేఖను ఈసీ అధికారులు పరిశీలించి, మామిడి పండు గుర్తు ఎవరికి కేటాయిస్తారన్న అనే అంశం ఇపుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే, తన తండ్రితో విభేదాలు తలెత్తిన తర్వాత అన్బుమణి హస్తినకు వెళ్ళి బీజేపీలోని పలువురు పెద్దలతో మంతనాలు జరిపారు. పార్టీపై పూర్తి పట్టు సాధించేందుకు వీలుగా ఆయన పావులు కదిపినట్టు సమాచారం. దీంతో పీఎంకే రాజకీయాలు ఇపుడు రసవత్తరంగా మారాయి.



సమాచార దర్శిని

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చెంగల్పట్టు, పెరుంబాక్కంలో ఉన్న ఐటీఐలో అడ్మిషన్లు గత నెల 23న ప్రారంభం కాగా ఈ నెల 31వ తేది వరకు జరుగనున్నాయి. 8 నుంచి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తగిన సర్టిఫికేట్లతో నేరగా ఐటీఐ కార్యాలయం నుంచి అడ్మిషన్లు పొందవచ్చు. వివరాలకు 9499055673, 9962986696 అనే నెంబర్లు సంప్రదించవచ్చని చెంగల్పట్టు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

ఐదో రోజూ పూర్తి సామర్థ్యంతో మేట్టూరు డ్యాం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాలు, కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేస్తున్న నీటితో సేలం జిల్లా మేట్టూరు డ్యాం బుధవారం కూడా పూర్తి సామర్థ్యం (120 అడుగులు)తో ఉంది. బుధవారం గణాంకాల ప్రకారం, మేట్టూరు డ్యాంకు 42,000 ఘనపుటడుగుల నీరు చేరుతుండగా, అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 93.47 టీఎంసీల నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

తాత్కాలికంగా మెరీనా స్విమ్మింగ్ ఫూల్ మూసివేత

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో కార్పొరేషన్‌కు చెందిన స్విమ్మింగ్ ఫూల్‌లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... స్విమ్మింగ్ ఫూల్‌లోని నీటి శుద్ధీకరణ కేంద్రం మరమ్మతులు లేకుండా పనిచేసేలా బాక్‌వాష్ పైపులు, సోక్ పిట్స్ ఏర్పాటుపనులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 11 నుంచి 31వ తేది (20 రోజులు) వరకు స్విమ్మింగ్ ఫూల్ మూసివేస్తున్నట్లు జీసీసీ తెలియజేసింది.

నేడు తాంబరంలో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం ముల్లై నగర్‌లోని సబ్ స్టేషన్‌లో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. కేంద్రంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే గ్రీవెన్స్‌లో, తాంబరం, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వినియోగదారులు పాల్గొని విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది (2026) హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న రాష్ట్రానికి చెందిన ముస్లింలు ముంబైలోని భారత హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు https://haj-com mittee.gov.in అనే వెబ్‌సైట్‌లో ఎలాంటి రుసుము లేకుండా ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు సమర్పించాలి. గత ఏడాదిలాగే, ఎంపిక చేసిన హజ్ యాత్రికులు వారి ప్రాధాన్యత ఆధారంగా 2 బయల్దేరే పాయింట్లు ఎంపిక చేసుకోవచ్చు.

బీఎడ్ దరఖాస్తు గడువు పొడిగింపు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీఎడ్‌లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు గడువు ఈ నెల 21వ తేది వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రాణిమేరి కళాశాల, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26వ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ www.tngasa.in అనే వెబ్‌సైట్‌లో గత నెల 20వ తేది ప్రారంభమై బుధవారంతో ముగిసిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 21వ తేది వరకు పొడిగించామన్నారు. 31న ర్యాంకుల జాబితా విడుదల చేస్తామని, ఆగస్టు 4 నుంచి 9వ తేదతి వరకు విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. 13వ తేది విద్యార్థులకు అడ్మిషన్ నియామక పత్రాలు www.iwiase.ac.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నామన్నారు. బీఎడ్ మొదటి సంత్సరం తరగతులు ఆగస్టు 20వ తేది నుంచి ప్రారంభమవుతాయని మంత్రి చెళియన్ తెలిపారు.

ఏడు డిగ్రీల మేర పెరగనున్న ఉష్ణోగ్రతలు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు రోజులు పగటి ఉష్ణోగ్రతలు సాధరణం కన్నా 7 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రం వైపు వీచే పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా, రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఒకటి, రెండు ప్రాంతాల్లో 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. రాష్ట్రంలో బుధవారం నుంచి మూడు రోజుల కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 7 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో మరో 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం నమోదయ్యే అవకాశముంది. అలాగే, పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

పాము కాటు మందు తయారీకి ప్రత్యేక కేంద్రం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు యాంటీ డోస్ ఉత్పత్తి చేసేలా ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ, ఇతర సంస్థలను కలుపుకుని ఈ ప్రత్యేక కేంద్రం ఏర్పాటుకానుంది. పాము కాటు మరణాలు తగ్గించేలా అధిక నాణ్యత కలిగిన ఔషధం ఉత్పత్తి చేయనున్నారు. ఆఫ్రికా, ఆగ్నేయ ఆసియా తదితర మార్కెట్లకు ఈ ఔషధం ఎగుమతి చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారుల సమాచారం.

అయోధ్య, వారణాశికి ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య పురస్కరించుకుని, మదురై నుంచి చెన్నై మీదుగా అయోధ్య, వారణాశికి ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు నడుపనున్నారు. మదురై నుంచి సెప్టెంబరు 9వ తేది బయల్దేరే రైలు చెన్నై ఎగ్మూర్ మీదుగా వెళ్లనుంది. ఈ రైలులో ఉత్తరాది రాష్ట్రాల్లోని మహాకాళేశ్వరం, ఓంకారేశ్వర్, అలోబి దేవి, సరయు హారతి దర్శనం, బృందావనం, బంకే బిహారి, రామ జన్మభూమి, కృష్ణ జన్మభూమి, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు, కాశీ విశ్వనాథర్ దర్శనం, కాశీ విశాలాక్షి దర్శనం, విష్ణువు దర్శనం, అన్నపూర్ణి దర్శనం, గంగా ఆరాధన వంటి ఏర్పాట్లు చేశారు. 16 రోజుల యాత్రకు ఒకరికి స్లీపర్ క్లాస్‌లో రూ.30,250, త్రీ టైర్ ఏసీలో రూ.45,750 ఛార్జీగా నిర్ణయించారు. ఈ ఛార్జీల్లో రవాణా ఖర్చులు, బస, భోజనం తదితరాలు చోటుచేసుకుంటాయి. మరిన్ని వివరాలకు 7305858585 అనే నెంబరు సంప్రదించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

అయ్యనార్ రథోత్సవంలో అపశ్రుతి

● ఇరుసు విరిగి ఒరిగిన రథం

టి.నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు సమీపం కోవిల్‌పాళయం గ్రామంలోని అయ్యనార్ ఆలయ రథోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వేలాదిమంది భక్తులతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ రథం మోకుతాడు పట్టుకుని లాగి రథోత్సవాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే ఊహించిన విధంగా కొంతదూరం నడిచిన ఆ రథానికి ఓ వైపున చక్రానికి సంబంధించి ఇరుసు విరిగి పక్కనే వస్తున్న మరో రథంపై వాలిపోయింది. వెంటనే మంత్రి శివశంకర్ స్థానిక అధికారులతో చర్చించి భారీ క్రేన్‌లను రప్పించి ఒరిగిన రథాన్ని చక్కబెట్టి అందులోని అయ్యనార్ ఉత్సవమూర్తిని పక్కనే ఉన్న మరో రథం పీఠంపై పెట్టారు. ఈ సంఘటనపై దేవాదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ అయ్యనార్ రథం అత్యంత ప్రాచీనమైనదని, ఆ రథం ఇరుసు కొయ్యతో తయారై ఉండటంతో ఉన్నట్టుండి విరిగి రథం వాలిపోయిందన్నారు. అదృష్టవశాత్తూ పక్కనే ఉన్న మరో రథంపై అయ్యనార్ రథం వాలడం వల్ల ప్రాణనష్టం జరుగలేదన్నారు. అయితే మంత్రి శివశంకర్ పాల్గొన్న ఈ రథోత్సవంలో రథం ఒరిగిపడటం పట్ల భక్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



ఇరుసు విరిగిపోవడంతో పక్కకు ఒరిగిన రథం - రథాన్ని తొలగించేందుకు పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న మంత్రి శివశంకర్

నేటినుంచి టోల్‌గేట్లలో ప్రభుత్వ బస్సులను అనుమతించొద్దు

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థలు టోల్‌గేట్లకు రూ.276 కోట్లు చెల్లించని కారణంగా దక్షిణ జిల్లాలోని నాలుగు టోల్‌గేట్లలో గురువారం నుంచి ప్రభుత్వ బస్సులను అనుమతించవద్దని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మదురై, కప్పలూరు, సాత్తూరు ఎట్టూరువట్టం, కయత్తారు, సాలైపుదూర్, నాంగునేరి టోల్‌గేట్లను నిర్వహిస్తున్న సంస్థ మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వ రవాణా సంస్థలు ఇప్పటివరకు రూ.276 కోట్లు టోల్ టాక్స్ బకాయిలుంచాయని తెలిపారు. ఈ కేసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ముందు బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ల తరుపున న్యాయవాదులు కోర్టుకు సమస్య వివరించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి జారీచేసిన ఉత్తర్వుల్లో సంబంధిత నాలుగు టోల్‌గేట్ల మీదుగా గురువారం నుంచి రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థల బస్సులను అనుమతించవద్దని, ఈ ప్రాంతాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత జిల్లాల ఎస్పీలను ఆదేశించారు. ఇదిలా వుండగా, రూ.276 కోట్ల మేర టోల్‌టాక్స్ బకాయి ఉంచినందువల్ల ప్రభుత్వ బస్సులను అనుమతించవద్దనే ఉత్తర్వులపై బుధవారం హైకోర్టులో రాష్ట్రప్రభుత్వం తరుపున అపీలు పిటిషన్ దాఖలైంది. దీనిపై గురువారం ఉదయం విచారణ జరపనున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

కుంభాభిషేకాల్లో సీఎం ఎందుకు పాల్గొనడం లేదు...?

● బీజేపీ సీనియర్ నేత తమిళిసై

వేలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాల కుంభాభిషేకంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఎందుకు పాల్గొనడం లేదని మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశ్నించారు. రాణిపేట జిల్లా షోలింగర్‌లోని యోగ నృసింహస్వామి ఆలయ కుంభాభిషేకంలో కుటుంబ సభ్యులతో తమిళిసై పాల్గొన్నారు. తొలుత రోప్ కార్ ద్వారా కొండ ఆలయానికి వెళ్లిన తమిళిసైకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ...57 సంవత్సరాల తర్వాత నిర్వహించిన యోగ నృసింహస్వామి కుంభాభిషేకంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పలు ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపట్టి, కుంభాభిషేకాలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదే సమయంలో, ఆలయ కుంభాభిషేకాల్లో ముఖ్యమంత్రి ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. రంజాన్, క్రిస్మస్ పండుగలకు శుభాకాంక్షలు తెలిపే సీఎం స్టాలిన్, హిందువుల పండుగలకు శుభాకాంక్షలు చెప్పకపోవడం సమంజసం కాదన్నారు. షోలింగర్ కొండలపై చెట్లు నరికే ఘటనలు అడ్డుకోవాలని తమిళిసై డిమాండ్ చేశారు.

13న టీవీకే ధర్నా

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుభువనం ఆలయ వాచ్‌మన్ అజిత్ కుమార్ మృతిపై న్యాయ విచారణ కోరుతూ ఈ నెల 13న తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు. ఎగ్మూర్‌లోని రాజారత్నం స్టేడియం వద్ద ఈ నెల 6వ తేది టీవీకే చేపట్టాల్సిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో టీవీకే న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. న్యాయస్థానం ఉత్తర్వులతో శివానందం రోడ్డులో ధర్నాకు పోలీసులు అనుమతించారు. ఈ విషయమై టీవీకే బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 13న శివానందం రోడ్డులో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో ధర్నా జరుగుతుందని ప్రకటించారు. కాగా, ఈ ధర్నాలో పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొంటారని పార్టీ శ్రేణుల సమాచారం.

డీఎంకేకు ఉపాధ్యాయులు గుణపాఠం చెబుతారు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ప్రభుత్వానికి ఉపాధ్యాయులు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ జోస్యం చెప్పారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌లో పేజీలో... నగరంలో ఉద్యోగులు క్రమబద్ధీకరించాలంటూ ఆందోళనకు యత్నించిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదుచేయడం డీఎంకే ప్రభుత్వ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డీఎంకే ప్రభుత్వ పాలనలో ప్రాథమిక హక్కుల కోసం ప్రభుత్వ ఉద్యోగులు నుంచి సామాన్య ప్రజల వరకు అందరూ వీధుల్లోకి వచ్చిన పోరాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళనకు యత్నించిన ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో, ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు చేసిన పోరాటాలకు మద్దతు తెలిపారని, అధికారం కోసం డీఎంకే ఎన్నికల మేనిఫేస్టోలో 181వ ఇచ్చిన హామీ ఎంతవరకు అమలుచేశారని, అధికారం చేపట్టిన వెంటనే హామీలు మరిచారా? అంటూ ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో అరాచక డీఎంకే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని నయినార్ నాగేంద్రన్ జోస్యం చెప్పారు.

ఈపీఎస్ వ్యాఖ్యలను ఖండిస్తూ విద్యార్థుల ధర్నా

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యలు ఖండిస్తూ కపాలీశ్వర కళాశాల విద్యార్థులు బుధవారం ధర్నా చేపట్టారు. 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీట్పోం' పేరుతో పళనిస్వామి రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టారు. కోవైలో జరిగిన ప్రచార సభలో డీఎంకే ప్రభుత్వ కళ్లు ఆలయాలపై పడ్డాయని, ఆలయాలకు వస్తున్న విరాళాలతో కళాశాలలు నిర్మాణాలకు వినియోగిస్తున్నారని పళనిస్వామి ఆరోపించారు. ఈ క్రమంలో, పళనిస్వామి వ్యాఖ్యలు ఖండిస్తూ కొళత్తూర్‌లోని కపాలీశ్వర ఆర్ట్స్ కళాశాల ఎదుట విద్యార్థుల, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాలలు నిర్మించడాన్ని తప్పుపట్టిన పళనిస్వామికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు.

బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు సంఘాల రాస్తారోకో

వేలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అన్నా ఆడిటోరియం సమీపంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవదాస్, ఈఎన్‌టీయూసీ నేత జ్ఞానశేఖరన్, నిర్వాహకులు పాండియన్, సుబ్రమణియం నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఈఎన్‌టీయూసీ, తమిళనాడు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక అన్నా ఆడిటోరియం వద్ద రాస్తారోకోలో రైతులు

ఆందోళన చేసిన టీచర్లపై కేసు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం నగరంలో మంగళవారం ఆందోళన చేపట్టిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులపై కేసు నమోదైంది. దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న ఉద్యోగాల క్రమబద్ధీకరణ సహా పలు కోర్కెల సాధనకు రాష్ట్ర కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం మంగళవారం జైల్ భరోకు పిలుపున్చింది. టీచర్లు ర్యాలీగా బయల్దేరగా ఓమందూర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపైనే ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను పోలీసులు వాహనాల్లో సమీపంలోని కల్యాణ మండపాలకు తరలించారు. ఈ నేపథ్యంలో, ఆందోళనలో పాల్గొన టీచర్లపై మూడు సెక్షన్ల కింద ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

తారాపురలో పెనుగాలులు

● కూలిపడిన విండ్‌మిల్ టర్బయిన్



నేలపై పడి ముక్కలైన విండ్‌మిల్ టర్బయిన్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా తారాపురం సీలయనాయకన్‌పట్టి చెరియన్‌కాడు తోట్టమ్ ప్రాంతంలోని విండ్‌మిల్లు టర్బయిన్ బుధవారం ఉదయం పెనుగాలులకు కూలి ముక్కలైంది. ఆ సమయంలో సంస్థ ఉద్యోగులు, కార్మికులు ఆ ప్రాంతంలో లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ముక్కలైన ఆ టర్బయిన్ విలువ రూ.3కోట్లని సంస్థ అధికారులు తెలిపారు. విండ్ మిల్లు టర్బయన్ కూలిపడటంతో విద్యుత్ వైర్లు తెగిపోయి, ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తాళవాడి చెరకుతోటలో ఏనుగుల బీభత్సం

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం తాళవాడివద్ద ఓ చెరకు తోటలో ఏనుగులు ప్రవేశించి నానాబీభత్సం సృష్టించాయి. తాళవాడి ఫారెస్ట్‌రేంజ్‌లో ఆంటోని అనే వ్యక్తి చెందిన చెరకుతోటలో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మూడు ఏనుగులు చొరబడటంతో ఆ తోటలోని కార్మికులంతా ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ ఏనుగులను చెరకుతోట నుండి తరిమేందుకు పలు విధాలా ప్రయత్నించారు. బాణా సంచా పేల్చినా, డప్పులు కొట్టినా ఆ ఏనుగుల ఏ మాత్రం కదలలేదు. చెరకుతోటలోనే తిష్ట వేశాయి. చివరకు రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానికులు, అటవీ శాఖ సిబ్బంది కలిసి గుంపుగా డప్పులు కొడుతూ, బాణ సంచా పేల్చుతూ ఆ ఏనుగులను అడవిలోకి తరిమికొట్టారు.



చెరకుతోటలోకి చొరబడుతున్న ఏనుగులు

బైక్‌ను ఢీకొన్న మినీలారీ

● మహిళ మృతి

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయం సమీపంలో బుధవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పుదుపేట ప్రాంతానికి చెందిన శ్రీదేవి (42) అనే మహిళ స్కూటర్‌పై సెంట్రల్ స్టేషన్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మినీలారీ ఆమె స్కూటర్‌ను ఢీకొంది. దీంతో శ్రీదేవి జారి పడటం, క్షణాల్లో లారీ వెనుక చక్రాలు ఆమెపై దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో శ్రీదేవి ఘటనా స్థలంలోనే మరణించింది. ప్రమాదానికి కారణమైన మినీ లారీ ఆగకుండా వెళ్ళిపోయింది. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ మినీ లారీని గుర్తించేందుకు ట్రాఫిక్ విభాగం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: గెలాక్సీ రోడ్డు, పెరియార్ వీధి, శివపథం వీధి. **తిరుముల్లైవాయల్:** అంబేద్కర్ నగర్ మెయిన్ రోడ్డు, అట్టన్‌తాంగళ్, బాలమురుగన్ నగర్, పిళ్లయార్ ఆలయ వీధి, కన్నన్‌కోయిల్, అట్టన్‌తాంగళ్ బ్రిడ్జి, కేకే నగర్, శివంతి ఆదిత్యనార్ నగర్, పెరుమాళ్ నగర్, వీపీఆర్ నగర్, శక్తి నగర్

అడయార్: బీసెంట్ నగర్ 6 నుంచి 15 క్రాస్ వీధులు, 2వ మెయిన్ రోడ్డు, ఆర్బీఐ క్వార్టర్స్, కక్కన్ కాలని, 4,16,29 క్రాస్ వీధులు, 2,3,7 అవెన్యూలు, టైగర్ వరదాచారి రోడ్డు ఎక్స్‌టెన్షన్.

షోలింగనల్లూర్: రాజేష్ నగర్, అత్తిపురీశ్వరర్ వీధి, అష్టలక్ష్మి నగర్, కోవలన్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పెరియార్ నగర్, కవిమణి వీధి, ఓంశక్తి నగర్, వెంకటేశ్వర నగర్, తామరై వీధి, సోము నగర్, దేవి కరుమారి నగర్, యునైటెడ్ కాలని, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, బెల్ నగర్ 4,5 క్రాస్ వీధులు, పుష్పా నగర్.

తాంబరం: మాదంబాక్కం మెయిన్ రోడ్డు, సుదర్శన్ నగర్, వీజీపీ శరవణ నగర్, శ్రీదేవి నగర్, అరవింద్ నగర్, కరుమారి అమ్మన్ నగర్, అంబిక నగర్, గాయత్రి గార్డన్, పార్వతి నగర్, శివశక్తి నగర్, శరవణ నగర్ కొంత భాగం, శ్రీనివాస నగర్ కొంత భాగం, సుందర్ అవెన్యూ.

కోయంబేడు మార్కెట్: జయలక్ష్మి నగర్, ధనలక్ష్మి నగర్, మూగాంబిక్తై నగర్, బాలకృష్ణ నగర్, రాజీవ్ గాంధీ నగర్, జానకిరామ్ కాలని, భువనేశ్వరి నగర్, రామలింగ నగర్, తామరై అవెన్యూ.

ఐఏఎస్ అధికారి కోర్టు కంటే గొప్పవారా?

● జీసీసీ కమిషనర్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి కోర్టు కంటే గొప్పవారా అని జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్‌ను ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఉల్లంఘన కేసులో గురువారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. జీసీసీ పరిధిలోని ఐదవ జోన్ రాయపురంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై జీసీసీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు చట్టవిరుద్ధ నిర్మాణాలపై చర్యలు తీసుకోవల్సిందిగా 2021 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఎటువంటి చర్యలు తీసుకోని జీసీసీకి వ్యతిరేకంగా రుక్మాంగదన్ హైకోర్టులో కోర్టు ఉల్లంఘన కేసు దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, హైకోర్టు ప్రథమ ధర్మాసనం ముందు అడిషనల్ సోలిసిటర్ జనరల్ జె.రవీంద్రన్ హాజరై జీసీసీ కమిషనర్‌కు విధించిన రూ.లక్ష జరిమానా ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు. అప్పుడు జోక్యం కలుగజేసుకున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్ తన అభిప్రాయాలను వ్యక్తంచేశారు. తన తరుపు న్యాయవాదులు సమర్పించే ప్రమాణపత్రాలను చదవకుండా సంతకం పెడితే ఆయన కమిషనర్‌గా ఉండేందుకు అర్హత లేదన్నారు. కోర్టు కంటే ఐఏఎస్ అధికారి గొప్పవారా అని మందలింపు ధోరణిలో ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. కోర్టు ఉల్లంఘన కేసు విచారణకు మంగళవారం హాజరుకాని జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ గురువారం తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉత్తర్వులు జారీచేశారు.

బంద్‌లో పాల్గొన్న సీపీఎం నేతల అరెస్ట్



సీపీఎం నేతలను అరెస్టు చేస్తున్న దృశ్యం

తిరుత్తణి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నూతన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని చిత్తూరు హైవేపై బుధవారం ఉదయం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆటో డ్రైవర్లు, కార్మికులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, సీపీఎం, సీపీఐల కార్మిక విభాగాలవారు పాల్గొని కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు అహ్మద్ అబ్దుల్ మీడియాతో మాట్లాడుతూ, ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికుల కనీస వేతనంగా పెంచాలని, పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఈపీఎఫ్ఓ చెందాదారులకు నెలకు రూ.9వేలు కనీస పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా అందజేసిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమతిలేకుండా నిరసన చేస్తున్నారనే కారణంతో సుమారు 70 మందిని అరెస్టు చేసి, స్థానికంగా వుండే కల్యాణ మండపాలకు, పార్కులకు తరలించారు. అదేవిధంగా షోళింగర్‌లో కూడా ధర్నా నిర్వహించిన సీపీఎం నిర్వాహకులను అరెస్టు చేశారు.

వందే భారత్ రైలులో హఠాత్తుగా పొగలు

● ఆందోళన చెందిన ప్రయాణికులు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలులో హఠాత్తుగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. చెన్నై-తిరునల్వేలి మధ్య మంగళవారం మినహా వారంలో ఆరు రోజులు వందే భారత్ రైలు నడుస్తోంది. 16 బోగీలతో నడుస్తున్న ఈ రైలు, బుధవారం ఉదయం 6.05 గంటలకు తిరునల్వేలి నుంచి చెన్నై ఎగ్మూర్ వైపు బయల్దేరింది. 8.25 గంటల సమయంలో మదురై దాటి వడమదురై ప్రాంతంలో వస్తున్న రైలులోని ఓ బోగీలో హఠాత్తుగా పొగలు చెలరేగాయి. ఆ బోగీలోని ప్రయాణికులు ఇతర బోగీల్లోకి పరుగులు తీశారు. రైలు క్యాంటీన్ ఉద్యోగులు ఈ విషయాన్ని లోకోపైలెట్‌కు తెలియజేయడంతో, మార్గమధ్యంలోనే రైలు నిలిపివేశాడు. రైల్వే ఉద్యోగులు అక్కడకు చేరుకుని పరిశీలించగా, ఏసీ ఎయిర్ ఇన్‌టేక్ నుంచి పొగలు వస్తున్నట్లు గుర్తించి, కొద్ది సమయంలోనే సమస్య పరిష్కరించారు. అనంతరం గంటన్నర ఆలస్యంగా రైలు దిండుగల్ వైపు బయల్దేరి వెళ్లింది.



రైలు బోగీలో పొగ వ్యాపిస్తున్న దృశ్యాలు

వ్యభిచారం నడుపుతున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూర్ సమీపంలోని ఇంట్లో వ్యభిచారం సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం కొళత్తూర్ లక్ష్మీపురం టీచర్స్‌కాలనీలోని ఓఇంట్లో తనిఖీచేపట్టారు.పొరుగు ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి, వారితో వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బాలకృష్ణను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఇద్దరు మహిళలను పోలీసులు ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది.

చిన్నాన్నకు బదులు పరీక్ష రాసిన కుమారుడు జైలుకు...!

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో చిన్నాన్నకు బదులు పరీక్ష రాసిన కుమారుడు జైలుపాలయ్యాడు. పదవ తరగతి పబ్లిక్ సప్లిమెంటరీ పరీక్షలు 4వ తేది ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో, అరియలూరు జిల్లా హస్తినాపురంలోని ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాలలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో ఈ నెల 7న ఇంగ్లీషు పరీక్ష జరుగుతున్న సమయంలో, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో పరీక్ష రాస్తున్న ఓ యువకుడి చిత్రం, హాల్ టిక్కెట్టులో ఫొటో తేడాగా ఉండడంతో, అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మహ్మద్ అలి అనే వ్యక్తి పరీక్ష రాయాల్సి ఉండగా, అతడికి బదులు ఆయన అన్న కుమారుడు మహ్మద్ అస్లాం పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు, మహ్మద్ అస్లాంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

వృద్ధురాలి దారుణహత్య

● 14 సవర్ల నగల దోపిడీ

టి.నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా వళ్ళియూరులో ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి 14 సవర్ల నగలను దోచుకెళ్ళిన దుండగుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వళ్ళియూరు విద్యుత్‌బోర్డు క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలో రుక్మిణి (71) అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు బాలచందర్, సెంథిల్‌మురుగన్ అనే ఇద్దరు కుమారులు, షణ్ముఖసుందరి అనే కుమార్తె ఉన్నారు. బాలచంద్రన్ కావల్‌కినరు మహేంద్రగిరి ఇస్రో కేంద్రంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె ఇంటికి సమీపంలోనే మరో ఇంటిలో ఆయన నివసిస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం రుక్మిణి ఇంటికి వెళ్ళి భోజనం ఇచ్చేవాడు. ఆ ప్రకారమే మంగళవారం మధ్యాహ్నం బాలచందర్ తల్లికి భోజనం ఇవ్వడానికి వెళ్ళాడు. ఇంటి లోపల నుండి ఎలాంటి అలికిడి వినిపించకపోగా, తలుపులు లోపలివైపు గడియపెట్టి ఉండటంతో ఆయన ఇంటి వెనుకవైపు వెళ్ళి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. గదిలో ఒంటి నిండా గాయాలతో రుక్మిణి నేలపై శవంగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఆమె మెడలో, చేతిలో ధరించి ఉన్న నగలు కూడా కనిపించలేదు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వళ్ళియూరు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు.



రుక్మిణి (ఫైల్‌ఫోటో)

సిలిండర్ పేలి రేకుల షెడ్లు నేలమట్టం

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లాలో ఒకటి తర్వాత ఒకటి నాలుగు సిలిండర్లు పేలడం కలకలం రేపింది. కాలేజి రోడ్డు ఎంజీఆర్ నగర్‌లో సాయిదేవికి చెందిన స్థలంలో ఉపాధి కోసం వచ్చిన ఉత్తరాది కార్మికులు రేకుల షెడ్లు వేసుకుని ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంతంలోని నాలుగు సిలిండర్లు ఒకటి తర్వాత ఒకటి పేలిపోయాయి. ఈ ఘటనలో 42 రేకుల షెడ్డు నేలమట్టామయ్యాయి. షెడ్లలోని అన్ని వస్తువులు మంటల్లో దగ్ధమయ్యాయి. ఆ సమయంలో కార్మికులు పనులకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.



ఘటనలో నేలమట్టమైన రేకుల షెడ్లు

కోలీవుడ్ హీరోయిన్‌గా మరో వైద్యురాలు

తమిళ చిత్రపరిశ్రమలో హీరోయిన్‌గా మరో వైద్యురాలు రంగప్రవేశం చేశారు. ఇప్పటికే జీవితంలో డాక్టర్లు అయిన సాయిపల్లవి, ఐశ్వర్య లక్ష్మి, అదితి శంకర్ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. ఇపుడు సింధు ప్రియ అనే వైద్యురాలు హీరోయిన్‌గా అరంగేట్రం చేశారు. 'ఇవన్ తందిరన్-2' అనే చిత్రంలో ఆమె కథానాయికగా ఎంట్రీ ఇచ్చారు. ఆమె గతంలో 'మాస్టర్', 'ఇండియన-2' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలో మెరిసారు. వసంత్ బాలన్ రూపొందించిన 'తలమై సెయలగం' అనే వెబ్ సిరీస్‌లో కూడా ఆమె ఓ ముఖ్య పాత్రలో కనిపించారు. ఇపుడు 'కరాటే బాబు', 'కయిలన్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్.కన్నన్ దర్శకత్వంలో గౌతం కార్తీక్ శ్రద్ధా శ్రీనాథ్, ఆర్‌జే బాలాజీ తదితరులు నటించిన 'ఇవన్ తందిరన్-2' అనే చిత్రంలో సింధు ప్రియ హీరోయినగా నటించారు.



సింధు ప్రియ

'పరందు పో'తో యువతకు చేరువయ్యాం : మిర్చి శివ



సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

'పరందు పో' వంటి మంచి చిత్రంతో నేటి యువ తరానికి కనెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని హీరో మిర్చి శివ అన్నారు. జియో హాట్ స్టార్, జీకేఎస్ ప్రొడక్షన్, సెవెన్ సీస్ అండ్ సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'పరందు పో'. రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలై పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీంతో ఈ సినిమా సక్సెస్ వేడుకలను తాజాగా నగరంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగీత దర్శకుడు సంతోష్ దయానిధి, ఎడిటర్ మది. గేయరచయిత మదన్ కార్కీ, నటులు మిదుల్, కేబుల్ శంకర్, శివ, హాట్‌స్టార్ ప్రదీప్ తదితరులు ప్రసంగించారు. 'ఈ సినిమాను సక్సెస్ చేసిన మీడియా మిత్రులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపిన చిత్ర దర్శకుడు రామ్ విడుదలకు ముందు చేపట్టిన ప్రమోషన్ కార్యక్రమాల ద్వారా ఈ సినిమా ప్రేక్షకులకు దగ్గరైంది. ఇందులో నటించిన మిర్చి శివ, గ్రేస్ అంటోనీ, అంజలి ఇతర నటీ నటులకు ధన్యవాదాలు' తెలిపారు. 'ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన హీరో మిర్చి శివ థియేటర్ విజిటింగ్ కోసం మదురై, సేలం, తిరునెల్వేలి వంటి ప్రాంతాలకు వెళ్ళినపుడు ప్రేక్షకుల స్పందన అనూహ్యం. గ్రేసీ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. సంతోష్ దయానిధి అతి తక్కువ సమయంలోనే మాకు మంచి సంగీతాన్ని సమకూర్చారు' అన్నారు.



'బన్ బట్టర్ జామ్' చిత్ర బృందం

'బన్ బట్టర్ జామ్' ఆడియో రిలీజ్

రెయిన్ ఆఫ్ ఆరోస్ పతాకంపై రాఘవ్ మిర్దాథ్ దర్శకత్వంలో సురేష్ సుబ్రమణియం నిర్మించిన చిత్రం 'బన్ బట్టర్ జామ్'. 'బిగ్ బాస్-5' సీజన్ విజేత రాజు జయమోహన్ హీరోగా నటించగా, ఆద్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరోయిన్లుగా నటించారు. ఇతర పాత్రలను చార్లీ, శరణ్య పొన్‌వణ్ణన్, దేవదర్శిని, మైఖేల్ తంగదురై, విజే బబ్లూ తదితరులు పోషించారు. త్వరలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఆడియో నగరంలో తాజాగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో జయమోహన్ మాట్లాడుతూ, 'నన్ను హీరోగా ఎంపిక చేసి చిత్రాన్ని నిర్మించిన దర్శక నిర్మాతలకు ఎన్నటికీ రుణపడివుంటాను. దళపతి విజయ్ లేకుంటే నేను లేను. ఆయన చేసిన ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో ఈ చిత్రానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోషన్ వచ్చింది. ఒక మంచి సందేశాన్ని ఈ చిత్రం ద్వారా ఇస్తున్నాం' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు రాఘవ్ మాట్లాడుతూ, 'సినిమా రంగాన్ని వదిలి వెళ్ళిపోదామా? అని భావిస్తున్న తరుణంలో ఈ అవకాశం వచ్చింది. నిర్మాతకు ధన్యవాలు. చిత్ర నిర్మాణంలో అడిగిన ప్రతిదానికి నిర్మాత కాదనకుండా సమకూర్చారు. సంగీత దర్శకుడు నివాస్ కె.ప్రసన్న మాట్లాడుతూ, 'నిర్మాత సురేష్ నా స్నేహితుడు. రాజు జయమోహన్‌తో కలిసి ఒక మంచి ఐడియాతో వచ్చారు. రాఘవ్ మిర్ధథ్ అద్భుతమైన పని చేశారు. ఈ సినిమా ప్రీమియర్ చూశాను ఎంతో బాగా వచ్చింది' అన్నారు.

చిత్రజ్యోతి

సినీ ప్రేమికులు కలిసి నిర్మించిన చిత్రం 'జన్మ నచ్చత్తిరం'



'జన్మ నచ్చత్తిరం' చిత్ర బృందం

సినిమాపై అమితాసక్తి, ప్రేమ కలిగినవారంతా కలిసి నిర్మించిన చిత్రం 'జన్మ నచ్చత్తిరం' అని దర్శకుడు లోకేష్ అన్నారు. చిత్రం విడుదలను పురస్కరించుకుని ఆడియోను తాజాగా రిలీజ్ చేశారు. 'ఒరునొడి' సినిమాకు వచ్చిన లభించిన ఆదరణతో అదే కాంబినేషన్‌లో ఈ చిత్రం తెరకెక్కింది. హర్రర్ జోనర్‌లో రూపొందిన 'ఓమన్' చిత్రానికి తమిళ వెర్షన్ ఇది. మణివర్మన్ దర్శకత్వంలో అమోఘం స్టూడియోస్, వైట్‌ల్యాంప్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించగా, ఈ నెల 18వ తేదీ విడుదల చేస్తున్నారు. ఇందులో తమన్ అక్షన్, మాల్వీ మల్హోత్రా, మైత్రేయ, రక్ష చెరిన్, అరుణ్ కార్తీ, కాళి వెంకట్, వేల రామమూర్తి, తలైవాసల్ విజయ్, సంతాన భారతి, యాసర్ తదితరులు నటించారు. దర్శకుడు లోకేష్, మీరన్, అరివళగన్ తదితరులు పాల్గొని, ఆడియో విడుదల చేశారు. లోకేష్ మాట్లాడుతూ, 'సినిమాపై ఎంతో మక్కువ, ప్రేమ ఉన్న వ్యక్తులు కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్రర్ చిత్రాలకు సంగీతం అతిపెద్ద బలం, సంజయ్ దీన్ని బాగా అందించారు. టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచాయి. సినిమా సక్సెస్ సాధించాలని కోరుకున్నారు. దర్శకుడు మీరన్ మాట్లాడుతూ, 'రాత్రిపూట షూటింగ్ చేయడం సాధారణ విషయం కాదు. కానీ, వీరు పుదుచ్చేరి వెళ్ళి కాఫీ తాగినంత సులభంగా పూర్తిచేశారు. సినిమా కోసం ఇందులో నటించిన ప్రతి ఒక్క నటీనటుడు ఎంతగానో కష్టపడ్డారన్నారు. దర్శకుడు అరివళగన్ మాట్లాడుతూ, 'హర్రర్ జోనర్‌లో రూపొందించడం వల్లే నన్ను ఇక్కడకు ఆహ్వానించారు. ఇది ఒక క్లాసిక్ హర్రర్ హిట్ మూవీగా నిలుస్తుంది. హర్రర్ జోనర్‌లో చాలా ఉప వర్గాలున్నాయి. ఇది సరికొత్త అనుభూతిని ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

రైలు బోగీలో వసతిగృహాలు

● కొత్త అనుభూతిని కలిగించనున్న దక్షిణ రైల్వే

టి.నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ యాత్రా స్థలం రామేశ్వరం వెళ్లే ప్రయాణికులకు దక్షిణ రైల్వే అధికారులు వినూత్న అనుభూతిని కలిగించేందుకు చర్యలు చేపడుతున్నారు. దేశవిదేశాల నుండి రామేశ్వరం క్షేత్రానికి రోజూ వేల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తున్నారు. ఇలా వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. రోజూ వచ్చే భక్తులు, పర్యాటకులు రామేశ్వరంలో తగిన బస సదుపాయం లేక ఇబ్బందులు పడుతుంటారు. ఆ క్షేత్రంలో ఒక రాత్రి బసచేస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆ కారణంగానే రోజూ వేలసంఖ్యలో వచ్చే భక్తులు, పర్యాటకులు రామేశ్వరంలోని లాడ్జీలు, రెస్టారెంట్లు, హోటళ్లలో ఆన్‌లైన్‌లో గదులను బుక్ చేసుకుంటున్నారు. భక్తుల అవస్థలను గమనించిన దక్షిణ రైల్వే అధికారులు ఓ వినూత్న పథకాన్ని అమలు చేయడానికి సన్నద్ధమైంది. ఆ ప్రకారం రామేశ్వరం రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే యాత్రికులు, భక్తులు, పర్యాటకులు బసచేయడానికి గదుల కోసం వెదుకులాడకుండా ఆ స్టేషన్‌లోనే బస కల్పించబోతోంది. దీని కోసం కొన్ని రైలు బోగీలను ప్రైవేటు సంస్థ సహకారంతో వసతి గృహాలుగా మార్చనుంది. ఐదు రైలుబోగీలను రామేశ్వరం రైలు స్టేషన్ సమీపంలోనే ఉంచి, బోగీల లోపలి భాగాన్ని వసతి గృహాలుగా ప్రత్యేకించి పడకగదులుగా మార్చనుంది. ఈ బోగీలను వసతిగృహాలుగా మార్చే పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించనున్నారు. ఆ తర్వాత దక్షిణ రైల్వే నిర్దేశించిన రుసుముతో ఆ గదులను అద్దెకివ్వనున్నారు. ఈ రైలు బోగీల వసతి గృహాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లను కూడా విడుదల చేసింది. రామేశ్వర క్షేత్రానికి వెళ్లే మధ్య తరగతి కుటుంబాలకు చెందిన భక్తులకు ఈ రైలు బోగీల వసతిగృహాలు అన్ని విధాలా అనువుగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.



రామేశ్వరం రైల్వేస్టేషన్‌లో వసతి గృహం కోసం సిద్ధంగా ఉన్న బోగీ



రైలుబోగీలో వసతిగృహం నమూనా చిత్రం

వైభవంగా నాగనాథస్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లాలో ప్రసిద్ధిచెందిన నాగవల్లియమ్మన్ సమేత నాగనాథస్వామి ఆలయం కాలసర్పదోష నివారణ క్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి ఆణి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మంగళవారం త్యాగరాజ పెరుమాళ్‌కు మహాఅభిషేకం నిర్వహించి, కైలాయ వాహనంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రధాన మండపంలో త్యాగరాయపెరుమాలును కొలువుదీర్చి దర్శనానికి అనుమతించారు. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం కోలాహలంగా జరిగింది. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రధాన ప్రవేశద్వారం నుంచి వేద మంత్రోచ్చారణ, మేళతాళాల మధ్య రథం కదిలింది. ఈ వైభవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, రథం లాగి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా బాల మునీశ్వరాలయ మహా కుంభాభిషేకం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న శివాచార్యులు

పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా గురువాపతన్‌మేడు గ్రామంలోని బాలమునీశ్వరుడు, భద్రకాళి ఆలయ మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయంలో రూ.50 లక్షలతో చేపట్టిన జీర్ణోద్ధరపనులు ముగియడంతో, మహాకుంభాభిషేకం నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఆ ప్రకారం, మూడు రోజులుగా గణపతి పూజ, మూలికలతో పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కుంభాభిషేకానికి వైకాలి అమ్మన్ సిద్ధర్ పీఠం స్థాపకుడు, ఆధ్యాత్మికవేత్త ఎం.సుందరవరదన్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, శివాచార్యులు మధురాంతకం దేవరాజ్ అయ్యర్ కుంభాభిషేక వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొనగా, భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి

●చెక్ డ్యాం ప్రారంభించిన మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి డివిజన్ అరుంపరుత్తి గ్రామ సమీపంలోని పాలారు నదిపై రూ.24.82 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంను నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో చెన్నై మండల ప్రధాన ఇంజనీర్ జానకి, ఉప మేయర్ సునీల్‌కుమార్, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... భూగర్భ జలమట్టాలు పెంచేలా రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌ డ్యాంలు నిర్మిస్తున్నామన్నారు. సుపరిపాలన అందించడమే డీఎంకే లక్ష్యమని మంత్రి దురైమురుగన్ తెలిపారు.



చెక్‌డ్యాం ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'మైఫుడ్, మై హెల్త్' ఆంగ్ల పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, సుచరితా రెడ్డి తదితరులు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలందించడంలో పేరొందిన అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'మై ఫుడ్, మై హెల్త్' ఆంగ్ల పుస్తకావిష్కరణ జరిగింది. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఆరోగ్య సంరక్షణకు దోహదం చేసే ఆహార పదార్థాల వివరాలతో ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్ కన్సల్టెంట్ డైటిటిక్స్ అనితా జాట్నా రచించిన 'మై ఫుడ్, మై హెల్త్' ఆంగ్ల పుస్తకావిష్కరణ గిండీలోని స్టార్ హోటల్‌లో బుధవారం ఉదయం జరిగింది. ఈ పుస్తకం తొలి ప్రతిని సుచరితా రెడ్డి ఆవిష్కరించి అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్.సి రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ గ్రూపు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ సిబల్, ఎండీ డాక్టర్ సునీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ వైస్‌ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 16 వినతులు



పెరంబూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించి, వారి సమస్యలు విన్నారు. అనంతరం సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

→ ప్రజల సమస్యలు వింటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

● వల్లకోట్టై కుంభాభిషేకం ఉదంతం...

సెల్వపెరుంతగైకి క్షమాపణ చెప్పిన మంత్రి శేఖర్‌బాబు



సెల్వపెరుంతగైని ఆయన నివాసంలో కలిసి క్షమాపణ చెబుతున్న దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు

టి.నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు సమీపంలోని వల్లకోట్టై మురుగన్ ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పట్ల అక్కడి దేవాదాయ శాఖ అధికారులు అనుచితంగా వ్యవహరించడంపై ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు క్షమాపణలు చెప్పారు. మంగళవారం రాత్రి ఆయన సెల్వపెరుంతగై నివాసానికి వెళ్ళి జరిగిన సంఘటనపై సారీ చెప్పారు. ఆ సందర్భంగా ఇద్దరూ పావుగంట సేపు సమావేశమయ్యారు. సోమవారం వల్లకోట్టై మురుగన్ ఆలయ కుంభాభిషేకంలో సెల్వపెరుంతగైని రాజగోపురంపై సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతించలేదు. గోపురంపై స్థలం లేదని చెప్పిన అధికారులు కాసేపయ్యాక ఆయనను గోపురం పైకి తీసుకెళ్లారు. స్థానిక శాసనసభ్యుడిగా సంప్రోక్షణ ప్రారంభించేలా సెల్వపెరుంతగై పతాకాన్ని ఊపాల్సి ఉండగా దేవాదాయ శాఖ అధికారే జెండా ఊపారు. ఆ సంఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో చేదు అనుభవం ఎదురైనా ముఖ్యమంత్రి స్టాలిన్, దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబుకు చెడ్డపేరు రాకూడదనే ఆ సమస్యను వివాదాస్పదంగా మార్చకుండా సహనం పాటించి దైవదర్శనం కూడాచేసుకోకుండా తిరిగొచ్చేశానని తెలిపారు. ఈ నేపథ్యంలోనే మంత్రి శేఖర్‌బాబు ఆయనకు క్షమాపణలు తెలిపారు. వల్లకోట్టై ఆలయం వద్ద సెల్వపెరుంతగై పట్ల అనుచితంగా వ్యవహరించిన దేవాదాయ శాఖ అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

రాజ్‌పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రుతిహాసన్



కొత్త లోగో ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణోత్సవ వేడుకల దిశగా దూసుకుపోతున్న 'రాజ్‌పారిస్' సంస్థ ప్రముఖ సినీ నటి శ్రుతిహాసన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. సంస్థ వ్యవస్థాపకులు ఛైర్మన్ ఆర్.సచ్చిదానందం, ఎండీ ఆర్.జయకుమార్ తదితరులు బుధవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. కొత్త లోగో ఆవిష్కరించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. 2030 నాటికి రూ.500 కోట్ల ఆదాయ సంస్థగా ఎదిగేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 45 ఏళ్ల క్రితం ప్రారంభమైన తమ సంస్థ వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొని ముందుకు సాగుతోందన్నారు. తాజాగా ఈసీఆర్‌లోని ముత్తుకాడు ప్రశాంత పరిసరాల్లో 55 ప్రత్యేక కుటుంబాల కోసం బొటిక్ లగ్జరీ ప్రాజెక్టు 'బ్లూ జువెల్' ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

'హిట్స్' క్యాంపస్‌లో ట్వంటీఫస్ట్ సెంచరీ వీడియో స్టూడియో



ట్వంటీఫస్ట్ సెంచరీ స్టూడియో ప్రారంభిస్తున్న రొమేనియా రాయబారి సేనా లతీఫ్

చెన్నై, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పడూరు ప్రాంతంలోని హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్) చెన్నై క్యాంపస్‌లో 21 (ట్వంటీఫస్ట్) సెంచరీ వీడియో స్టూడియో ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. భారతీయ, రొమేనియా కళాకారుల సాంస్కృతిక సంబంధాలను పటిష్టపరచడంలో భాగంగా ఈ స్టూడియోను భారతదేశంలోని రొమేనియా రాయబారి సేనా లతీఫ్ ప్రారంభించారు. అంతకు ముందు ఆమె 'సాంస్కృతిక బంధం : ప్రపంచానికి రొమేనియా సాంస్కృతిక సేవలు, భారత్- రొమేనియా మైత్రీబంధం' అనే అంశంపై విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సంబంధించి రొమేనియా రాయబారి డాక్టర్ విజయ్‌మెహతా, ఫిల్మ్‌మేకర్ డాక్టర్ సంజనా జోన్, హిట్స్ ప్రొఛాన్సలర్ డాక్టర్ అశోక్ జార్జ్ వర్గీస్, డిప్యూటీ డైరెక్టర్ ఎనిడ్ వర్గీస్ జేకబ్ తదితరులు పాల్గొన్నారు.

స్నిగ్ధ పోటీల్లో ఎస్‌కేపీసీ విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో మేకప్ కళాకారిణి స్వప్న

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో స్నిగ్ధ 2025-2026 పేరిట రెండు రోజుల కార్యక్రమం బుధవారం వాసవీ మాత పూజతో ప్రారంభమైంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆఫ్ స్టేజీ ఈవెంట్లుగా నైల్‌ఆర్ట్, బాటిల్ ఆర్ట్, మండల ఆర్ట్, మోడలింగ్ తదితర పోటీలు నిర్వహించగా, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగిన ప్రతిభకు గుర్తింపు కలిగేలా ఆన్ స్టేజ్, ఆఫ్ స్టేజ్ ఈవెంట్లను రెండు రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. తొలిరోజు న్యాయనిర్ణేతలుగా పారిశ్రామికవేత్త రాధాకృష్ణ బాలాజీ, అశ్మితాస్ మ్యాజిక్‌టచ్ బ్యూటీ జోన్ కళాకారిణి జి.స్వప్న వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించిన సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డా.వనిత మాట్లాడుతూ... ప్రతి ఏడాది ఆనవాయితీగా తమ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులతో స్నిగ్ధా పేరిట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.పి.భరణికుమారి, కన్వీనర్ డా.జి. చందన దీప తదితరులు పాల్గొన్నారు.

వీఐటీ ఛాన్సలర్‌కు ఉయర్ సెమ్మల్ అవార్డు

● విశ్వనాథన్‌ను సత్కరించిన నార్త్ అమెరికా తమిళ సంఘం

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ యూనివర్శిటీ ఛాన్సలర్ డా.కె.విశ్వనాథన్ అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యారంగానికి అందిస్తున్న సేవలను గుర్తించిన 'నార్త్ అమెరికా తమిళ సంఘం 'ఉయర్ సెమ్మల్ అవార్డు'తో ఘనంగా సత్కరించింది. నార్త్ అమెరికాలో 70కి పైగా తమిళ సంఘాలు సంయుక్తంగా 38యేళ్ళుగా తమిళ భాష, సం స్కృతి, కళలు, సాహిత్యం, పరిశ్రమలు, సినీ, నాటక రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న తమిళులను ఎంపిక చేసి ప్రతిఏటా పురస్కారాలందించి గౌరవిస్తోంది. ఆ విధంగా ఇటీవల కరోలినాలో ఉన్న ర్యాలేలో జరిగిన వార్షిక మహానాడులో ఉన్నత విద్యారంగంలో వేలూరు వీఐటీ ఛాన్సలర్ డా.కె.విశ్వనాథన్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, ఆయనకు ఉయర్ సెమ్మల్ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో వీఐటీ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ జీవీ సెల్వం, విదేశీ తమిళుల సంఘం డైరెక్టర్ ఆర్.శ్రీనివాసన్, నార్త్ అమెరికా తమిళ సంఘాల నిర్వాహకులు పాల్గొని విశ్వనాథన్‌ను అభినందించారు.



వీఐటీ ఛాన్సలర్ కె.విశ్వనాథన్‌ను అభినందిస్తున్న డాక్టర్ సెల్వం, శ్రీనివాసన్ తదితరులు

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,320

తలనీలాలు సమర్పించినవారు: 24,950



త్వరలో విజయ్ 'జన నాయకుడు'

సినీ నిర్మాత ఎన్‌కే లోహిత్

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): దళపతి విజయ్ నటిస్తున్న 'జననాయకుడు' సినిమాను త్వరలో విడుదల చేయనున్నట్టు ఆ చిత్ర నిర్మాత ఎన్‌కే లోహిత్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో తెలుగులో ఓ భారీ చిత్రాన్ని తీయబోతున్నామని, నెలరోజుల్లో ఈ వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. అలాగే, శ్రీవారిని తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేత అన్నామలై, వ్యాసరాజ మఠాధిపతులు విశ్వప్రియ తీర్థ, ఈషాప్రియ తీర్థ, సినీ హీరో ఆశీష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. 'దేత్తడి' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభంకానుందని ఆశీష్‌రెడ్డి తెలిపారు.



నిర్మాత ఎన్‌కే లోహిత్



ఆశీష్ రెడ్డి



వ్యాసరాజ మఠాధిపతితో అన్నామలై

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు సీజే శ్రీరామ్



తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

మహాబలిపురంలో లేజర్‌షో

పరిశీలించిన ఇంజనీర్ల బృందం

ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో ప్రపంచ పర్యాటక కేంద్రం మహాబలిపురంలో రూ.13 కోట్లతో నిర్మితమవుతున్న లేజర్‌షో పనులను తమిళనాడు టూరిస్ట్ డెవెలెప్మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ)ఇంజనీర్ల బృందం బుధవారం పరిశీలించింది. పల్లవరాజుల పరిపాలనలో మహాబలిపురంలో అద్భుతమైన రాతిశిల్ప కళా మండపాలు నిర్మించారు. పంచరథాలు, అర్జున తపస్సు మండపం, రాతితో నిర్మించిన ఆలయాలు, మండపాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశంలోని పలు ప్రాంతాలు, విదేశీ పర్యాటకులు ప్రతిరోజు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఇక్కడికి రాత్రి సమయంలో పర్యాటకులకు వినోదం ఇచ్చేందుకు మరకతం పార్కులో రూ.8కోట్లతో విద్యుత్ దీపాలతో గార్డెన్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో లేజర్‌షోతో పాటు వన్యప్రాణులు, సీతాకోకచిలుకలు, చెట్లు, వాటర్ ఫౌంటెన్, మినీ 5డీ సినిమా హాలు, ఫుడ్ కోర్టు సుమారు 200 ఎకరాలతో కళాత్మకంగా ఈ పార్కు ఏర్పాటుకానుంది. అదేవిధంగా రాత్రివేళ పర్యాటకులకు రాతి శిల్పాలకు సంబంధించిన చరిత్రను పూర్తిగా తెలియజేసేలా రూ.5 కోట్లతో లేజర్‌షో ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 75శాతం మేరకు పనులు పూర్తయిన నేపథ్యంలో, బుధవారం టీటీడీసీ చీఫ్ ఇంజనీర్ శరవణన్, మహాబలిపురం పర్యాటక విభాగం అధికారి శక్తివేల్ నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం పరిశీలించింది.



లేజర్‌షో పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్లు

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఏపీ జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధి కారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగావారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డ్రమ్స్ శివమణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద డ్రమ్స్ శివమణి, కుటుంబసభ్యులు

మరోమైలు రాయిని అధిగమించిన

శ్రీసిటీ - వీఆర్వీ పరిశ్రమ

● ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి



వీఆర్వీ పరిశ్రమ సరఫరా చేస్తున్న భారీ క్రయోజనిక్ ట్యాంకు

శ్రీసిటీ. జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని క్రయోజనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పిసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో మైలురాయిని అధిగమించింది. ఎయిర్ లిక్విడ్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్ సైజ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంకును ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఎగుమతి చేసిన క్రయోజనిక్ ట్యాంక్ 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగి ఉండడం విశేషం. మంగళవారం ఉదయం 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా ఈ ట్యాంకును కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజనిక్ ఇంధన నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపును వీఆర్వీ పరిశ్రమ దక్కించుకుంది. కాగా దేశంలో దాదాపు 17 సంవత్సరాలుగా నాణ్యత, నూతన ఆవిష్కరణలతో ప్రసిద్ధి చెందుతున్న వీఆర్వీ సంస్థ అమెరికాలోని ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థతో పాటు భారత్‌లోని ఇస్రోకు విశ్వసనీయ భాగస్వామిగా మారింది. కోవిడ్ సంక్షోభ సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను వీఆర్వీ సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులతో పాటు తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను వీఆర్వీ సకాలంలో సరఫరా చేసి కీలక పాత్ర పోషించింది. కాగా మైలురాయిని అధిగమించిన వీఆర్వీ పరిశ్రమ యాజమాన్యానికి, ఉద్యోగులకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

13న ఐఐటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభం

ఏర్పేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆహార ప్రాసెసింగ్ రంగంలో యువ ఔత్సాహికులకు వేదికగా సామూహిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఈనెల 13న ప్రారంభించనున్నారు. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కూడా హాజరు కానున్నారు. ప్రత్యేక అతిథులుగా తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఏపీ ఎఫ్‌పీఎస్ సీఈవో శేఖర్‌బాబు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరు కానున్నారు. జూలై 13న ఉదయం 9.30గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది.

రోడ్డుపై మద్యం సేవించిన యువకులు

● రూ.3 వేలు లంచం తీసుకున్న హెచ్‌సీ సస్పెన్షన్

అడయార్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన కూర్చొని మద్యం సేవించిన యువకుల నుంచి రూ.3 వేలు లంచం తీసుకున్న హెడ్ కానిస్టేబుల్‌ను పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తిరుచ్చి జిల్లా కేంద్రంలో వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలను పరిశీలిస్తే, తిరుచ్చి సంజీవి నగర్‌లో ఈ నెల 6వ తేదీ ముగ్గురు యువకులు రోడ్డు పక్కన కూర్చొని మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన హెడ్ కానిస్టేబుల్ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని, పబ్లిక్ ప్లేస్‌లో మద్యం సేవించినట్టుగా కేసు నమోదు చేస్తే ఆ కేసు నుంచి బయటపడేందుకు వేలాది రూపాయల ఖర్చు చేయాల్సి వస్తుందని హెచ్చరించి, రూ.3 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిపోయిన వారు డబ్బులు సమర్పించుకున్నారు. ఆ తర్వాత తమకు తెలిసిన న్యాయవాది ద్వారా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశం మేరకు విచారణ జరిపారు. ఈ విచారణలో హెడ్ కానిస్టేబుల్ లంచం తీసుకున్నట్టు తేలడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

తొలి త్రైమాసికంలో సోనాలికా రికార్డు స్థాయి విక్రయాలు

అడయార్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ట్రాక్టర్ల అమ్మకాల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సోనాలికా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి అమ్మకాలను సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 43,603 ట్రాక్టర్లను విక్రయించింది. రైతుల శ్రేయస్సు మెరుగైన ఉత్పాదకతను సాధించేలా హెవీ డ్యూటీ ట్రాక్టర్లను సోనాలికా తయారు చేసి దేశంలోనే కాకుండా, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఏప్రిల్ - జూన్ మధ్యకాలంలో 43,603 ట్రాక్టర్లను విక్రయించినట్టు సోనాలికా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఊటీ రోడ్లపై ఎలుగుబంటి

అడయార్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ జనావాస ప్రాంతంలో ఓ ఎలుగబంటి రోడ్లపై సంచరించింది. దానిని చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సాధారణంగా ఊటీ రహదారులపై అనేక రకాలైన అడవి జంతువులు సంచరిస్తుంటాయి. ఏనుగులు మాత్రం తేయాకు, అరటి తోటల్లోకి ప్రవేశించి ధ్వంసం చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఓ ఎలుగు బంటి ఒకటి పట్టపగలు రోడ్డులో విహరిస్తూ కనిపించింది. దీన్ని చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

పల్లం నుంచి పూడికి రైలు మార్గం

● 26 కిలోమీటర్ల మేర సర్వే పనులు ప్రారంభం

ఏర్పేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు నుంచి పాతవీరాపురం, ఎండీపుత్తూరు మీదుగా వడమాలపేట వద్ద ఉన్న పూడి వరకు (26 కిలోమీటర్లు) కొత్త రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఈ మార్గాన్ని పూడి రైల్వే స్టేషన్‌తో అనుసంధానించనున్నారు. సర్వే పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం రైల్వే అధికారులు ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశమై పరిహారం తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలిసింది.

కోవైలో వన మహోత్సవం

● మొక్కలు నాటిన మహిళలు



ప్యారీస్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం కోయంబత్తూరులో వనమహోత్సవం నిర్వహించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటడంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చిన కావేరి కుక్కురల్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వన మహోత్సవంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. దేశంలో ప్రజల మధ్య అడవుల సంరక్షణ, పర్యావరణంపై అవగాహన, చెట్లపెంపకం అలవాటు పడేలా ప్రతీఏటా జూలైలో వన మహోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ, ప్రతిఏటా కావేరి కుక్కురల్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా చెట్లు నాటే ఘట్టాన్ని వన మహోత్సవంగా జరుపుకుంటున్నారు. ప్రస్తుతం 55 గ్రామాల్లో 333 రావిచెట్లు, 155 ఎకరాల వ్యవసాయ భూముల్లో 50 టింబర్ చెట్లను నాటారు.

బస్సు ప్రయాణాలపై విద్యార్థులకు అవగాహన

తిరుత్తణి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణాలపై డాక్టర్ రాధాకృష్ణన్ హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సీఐ మధియరసన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధియరసన్ మాట్లాడుతూ, పిల్లలు తరచూ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేయడం ప్రమాదకరమని, పొరపాటున కిందపడి మృతిచెంది మీ తల్లిదండ్రులకు పుత్రశోకం మిగల్చవద్దని తెలిపారు. విద్యార్థి దశనుంచే సమాజం పట్ల, పెద్దల పట్ల గౌరవ భావాలు పెరగాలని, లేకుంటే భవిష్యత్తులో సంఘ విద్రోహులుగా మారే అవకాశముందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తిరుత్తణి పోలీసులు



వైభవంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వ రాలయానికి అనుబంధంగా పట్టణం లోని చెన్నైరోడ్డులో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలం కార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పిం చారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిం చారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వా యిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై అధిష్ఠింపజేసి పట్ట ణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర హార తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



వామ్మో.. ఎంత పెద్ద లారీ

సాధారణంగా నాలుగు, ఆరు చక్రాల లారీలను చూస్తుంటాం... అప్పుడప్పుడూ పది, పదహారు చక్రాల లారీలనూ చూసుంటాం. కానీ మంగళవారం తడలో 50 చక్రాల లారీ అందరినీ ఆకర్షించింది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కెలా నుంచి తడ మీదుగా చెన్నైకు భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న 50 చక్రాల చక్రాల లారీ తడలో కొంతసేపు ఆగింది. లారీపై భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో జనం ఆసక్తిగా గమనించారు.

- తడ, ఆంధ్రజ్యోతి